అబద్ధమాడి చూడు!

వసుంధర

బాబాకి శ్రీనివాసు వ్యవహారం నచ్చలేదు. వాల్తేర్లో ట్రయినెక్కినప్పట్నుంచీ శ్రీనివాసు ఏకదీక్షతో పేపరు చదివేస్తున్నాడు. ట్రయినప్పుడే తుని చేరబోతోంది కానీ శ్రీనివాసు పేపరు చదవడం పూర్తి కాలేదు.

"నేరకపోయి నీతో బయల్దేరాను. ఓ కాలక్షేపం లేదు. పాడూ లేదు. పేపరు ముందేసుకుని కూర్చున్నావ్" అన్నాడు బాబా చిరాగ్గా.

"ఏమిట్రా నీ గోల ఎప్పుడూ పేపరు చదవని వెధవ్వి అందులో మజా నీకేం తెలుస్తుంది. ఎప్పుడో ఇలా ట్రయినెక్కినప్పుడు తప్పితే తీరుబడిగా పేపరు చదివే అదృష్టం నాకు మాత్రమెక్కడిది?" అన్నాడు శ్రీనివాసు.

"పేపరు చదవడం అదృష్టమంటావ్. నీకు తెలుసో తెలియదో ఒక ప్రముఖ ఇంగ్లీషు రచయిత న్యూస్ పేపర్సు చదవడం గురించి ఏమన్నాడో తెలుసా ఏ పుస్తకమూ చదవని వాడుకూడా నిత్యం న్యూస్ పేపర్సు చదివేవాడి కంటే మెరుగన్నాడు..."

"ఈ ప్రపంచంలో అన్నింటినీ సమర్థిస్తూ, అన్నింటినీ విమర్శిస్తూ సామెతలున్నాయి. వారివారి అభిరుచులనుబట్టి ఆయా సామెత లుపయోగిస్తూంటారు" అని తీసిపారేశాడు శ్రీనివాసు.

"ఛాలెంజి నువ్విప్పుడు పేపర్లో చదువుతున్న వార్తల్లో ప్రతి ఒక్కదానిగురించీ నీకంటె నాకే ఎక్కువ తెలుసునని ఋజువు చేస్తాను" అన్నాడు బాబా. బాబా వార్తా పత్రికలు బొత్తిగా చదవని బాపతు కాదు. క్రీడారంగం అతని అభిమాన పేజీ. మిగతావన్నీ హెడ్ లైన్సు చూస్తాడు. ఇప్పుడు తను చేసిన ఛాలెంజి తన ప్రతిభ ప్రదర్శించాలనే ఉద్దేశ్యంతో చేసింది కాదు. కాసేపు శ్రీనివాసుని పేపరు చదవకుండాఆపి కబుర్లలో దింపాలని అతని ఉద్దేశ్యం.

బాబా మాటలకు శ్రీనివాసుకి పౌరుషం వచ్చింది. అతను రాజకీయపరమైన కొన్ని వార్తలు గురించి అడిగేడు. వాటికి బాబా తనకు తెలిసినవి, తోచినవి, కల్పించినవి చెప్పేడు. నిజంగానే అతనికి శ్రీనివాసుకంటే ఎక్కువ తెలుసుననిపించేలా మాట్లాడేడు.

బాబా తెలివైనవాడు. చలాకీ ఐనవాడు. తనకి నా అన్నవాళ్ళు లేరు. దూరపు బంధువుల ఇంట్లోవుండి మెట్రిక్

అనిపించుకున్నాడు. టైపూ, షార్టుహ్యాండూ వచ్చును. అతనికి ఉద్యోగం లేదు. ఏ రకం పని చేయడానికైనా అతనికి నామోషీ లేదు. డబ్బుకోసం అతను హోటల్లో సర్వింగ్ చేశాడు. బస్సుస్టాండులో బరువులు మోసాడు. మధ్యమధ్యలో ఓ ఉద్యోగానికి అప్లికేషన్ పడేస్తూండేవాడు.

ఇప్పుడతనికి రాజమండ్రిలో ఏదో ఉద్యోగానికి ఇంటర్వ్యూ వచ్చింది. ఇంటర్వ్యూకింకా రెండ్రోజులు టయిముంది. కానీ ప్రస్తుతం అతను వాల్తేర్లో ఓ పది రోజుల్నించి శ్రీనివాసు ఇంట్లో వుంటున్నాడు. బస్సుస్టాండులో బాబా పరిస్థితి చూసి శ్రీనివాస్ అతన్ని తనింటికి పిల్చుకువెళ్ళాడు.

శ్రీనివాస్, బాబాకు హైస్కూలు స్నేహితుడు. శ్రీనివాస్ మధ్యతరగతి బాబులబిడ్డ. బుద్ధిమంతుడు. తన చదువు, పుస్తకాలు తప్ప రెండో ప్రపంచం అతనికి తెలియదు. సెకండ్ ఫారంనించి ఫోర్త్ ఫారంవరకూ వీళ్ళిద్దరూ క్లాస్‌మేట్సు. బాబాది ఫోర్త్ ఫారం పరీక్షపోయింది. వెంటనే అతని బంధువు చదువు మానిపించి మెట్రిక్కి కట్టించాడు. మెట్రిక్ ఆరో ప్రయత్నంలో ప్యాసయ్యాడు బాబా.

ప్రతివార్త గురించీ తనకంటె బాబా ఎక్కువగా ఏకరువు పెడుతుంటే శ్రీనివాసుకి పౌరుషం వచ్చేస్తోంది.

తెలిగ్గా ఉడికిపోయే స్వభావం అతనిది. అందుకని అడ్డమైన వార్తలగురించీ బాబాని ప్రశ్నించసాగాడతను. అలా మాట్లాడుతూండగా గజదొంగ గంగన్న వార్త వచ్చింది.

"అది సరే గజదొంగ గంగన్న గురించి నీకేం తెలుసో చెప్పు" అన్నాడు శ్రీనివాస్.

బాబా నవ్వి "ఈ మాత్రానికి పేపరు చదవాలా అత గాడు ఒక్కడూ ఒక్క రాత్రిలో పదిమంది నగల వర్తకుల ఇళ్ళు దోపిడి చేశాడు. ఈ సంగతి దేశమంతా తెలుసు" అన్నాడు.

"అంతేనా నీకు తెలిసింది" అన్నాడు శ్రీనివాస్.

"ఇంకా తెలుసు. ఆ తర్వాత పోలీసులకు దొరికి పోయాడు. కానీ అతను దోచిన సొమ్ము మాత్రం ఇంత వరకూ ఎవరికీ దొరకలేదు. పోలీసులు శతవిధాల ప్రయ త్నించి కూడా గంగన్న చేత ఏమీ చెప్పించలేక పోయారు" అన్నాడు.

"అంతేనా నీకు తెలిసింది" అన్నాడు శ్రీనివాస్.

క్షణంకూడా తటపటాయించకుండా "గంగన్న ఆ సొమ్మెక్కడ దాచాడో కూడా నాకు తెలుసు. గంగన్న తర్వాత ఈ ప్రపంచంలో ఆ విషయం తెలిసిన వాడిని నేనొక్కణ్ణే ననుకుంటాను" అన్నాడు బాబా.

అంతేనా అనబోయి ఆగిపోయాడు శ్రీనివాస్. బాబా అన్న మాటలకతను తెల్లబోయాడు. క్షణం తర్వాత తేరు కుని "కోయ్" అన్నాడు.

"కోతలు కాదు నేను నిజమే చెబుతున్నాను" అన్నాడు బాబా.

"ఇంపాజిబుల్" అన్నాడు శ్రీనివాస్.

"నువ్వు నమ్మకపోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. కానీ, దోపిడీ జరిగిన మర్నాడు అనుకోని విచిత్ర పరిస్థితుల్లో గంగన్న, నేను కలుసుకున్నాం" అన్నాడు బాబా.

శ్రీనివాస్ ముఖంలో అనుమానం స్పష్టంగా కనిపిస్తోంది. "అయితే నీకీ కష్టమేమిటి? హాయిగా ఆ సొమ్మంతా అనుభవించవచ్చుగా..." అన్నాడు.

"నాకేమీ అభ్యంతరం లేదు. కానీ, అదంతా నగల రూపంలో వుంది. మార్చుకోవడం నాబోటివాడివల్ల కాదు. తర్వాత రెండో భయం ఏమిటంటే గంగన్నను వదిలిపెట్టారంటే అతగాడు తిన్నగా వచ్చి నామీద పడతాడు. అందులో పూచిక పుల్లకూడా ముట్టుకోనని వాగ్దానం చేశాను. నా వాగ్దానం నిలబెట్టుకుంటే తిరిగి వచ్చేక తనే సగం వాటా ఇస్తానన్నాడు. నిలబెట్టుకోకపోతే ప్రాణాలు తీస్తానన్నాడు."

"బాగానేవుంది. అయితే గంగన్న ఆ సొమ్ము ఎక్కడ దాచాడంటావ్?"

"అమ్మో—అది చెప్పకూడదు. గోడలకు చెవులుండవచ్చు" అన్నాడు బాబా.

అతనా మాటలన్న సమయానికి ఈ మాటలను శ్రద్ధగా వింటూ పైబెర్తుమీద కూర్చునివున్న ఒక మనిషి చటుక్కున బెర్తుమీంచి క్రిందకురికాడు.

అతని కళ్ళు ఎర్రగా వున్నాయి. అతనికి పెద్ద మీసాలున్నాయి. నల్లపాంటుమీద తెల్లషర్టు వేసుకునివున్నాడు. వయసు ముప్ఫైసంవత్సరాలకు మించివుండదు.

అతను బాబావైపు చూసి పలకరింపుగా నవ్వి బాబా ఎదుటి సీట్లో కాళీ చేసుకు కూర్చున్నాడు.

2

"ఇంక పెళ్ళివాయిదా వేయడానికి వీల్లేదు" అంది యమున.

"ఏం?" అన్నాడు చంద్రభాను.

"నువ్వు తండ్రివి కాబోతున్నావు" అంది యమున.

"పెళ్ళికాకుండా ఆడది తల్లి అవుతుందేమో కానీ, మగవాడు తండ్రి కాలేడు."

"కానీ నువ్వయ్యావు?"

చంద్రభాను నవ్వి "నేనేనని ఏమిటి సాక్ష్యం?" అన్నాడు.

"నువ్వే?" అంది యమున.

"నా సాక్ష్యాన్ని నువ్వు నమ్మే పక్షంలో నేను చెప్పేదిది. నేను నిన్ను ప్రేమించిన మాట వాస్తవం. కానీ, ఎన్నడూ హద్దు మీరలేదు. నీ ప్రవర్తన సరైనది కాదని ఈ రోజే తెలిసింది కాబట్టి నీకూ నాకూ ఈ రోజునించీ ఇంకే సంబంధమూ లేదు..." అని చంద్రభాను క్షణం ఆగకుండా అక్కణ్ణించి విసవిసా నడుచుకుంటూ వెళ్ళి పోయాడు.

యమున కదలలేక అక్కడే అలా ఉండిపోయింది. చంద్రభాను అసలు స్వరూపం గురించి జానకి చెప్పినది నిజమేనన్నమాట!

అదృష్టవశాత్తూ నిన్న తను జానకిని కలుసుకున్నప్పుడు తన ప్రేమ వ్యవహారం చెప్పింది. జానకి ఆశ్చర్యపడి— "ఎవరినీ–నువ్వు ప్రేమిస్తున్నది చంద్రభానునా?" అంది.

"ఏం?" అంది తను.

"వాడు పరమ నీచుడు. మోసగాడు. ఇప్పటికి నలుగు రైదుగురు ఆడపిల్లల్నయినా వాడు మోసగించి వుంటాడు. వివరాలు నన్నడగొద్దు. రేపు కలుసుకున్నప్పుడు తల్లిని కాబోతున్నానని చెప్పు. వాడి నిజ స్వరూపం బయటపడు తుంది—" అంది జానకి.

ఇప్పుడు చంద్రభాను నిజ స్వరూపం బయటపడింది. ఇంతవరకూ దేవుడు తనను కాపాడాడు. కానీ ఇకముందు తన్ను తనే కాపాడుకోవాలి.

కానీ యమున మనసు బాగోలేదు. ఆమె చంద్రభానును మనసారా ప్రేమించింది. అతని మాయ మాటలు నమ్మింది. తన కన్నెవయస్సు అర్పించింది. ఇప్పుడు తను మోసగాడని తెల్సిపోయింది.

కాస్సేపాగి లేచి యమున ఇంటికి వెళ్ళింది. గుమ్మంలోనే ఉరిమి చూసే కళ్ళతో తండ్రి కనిపించాడు. ఆమె లోపలకు రాగానే తలుపులు వేసి_ "అయితే నేను తాతను కాబోతున్నానన్నమాట_" అన్నాడు.

యమున తెల్లబోయింది. ఆమె నోట మాట రాలేదు.

"మీరిద్దరూ పార్కులోకి వెళ్ళడం నేను చూశాను. విషయం తెలుసుకుందామని మీకు తెలియకుండా వెనకాలే వచ్చాను—" అన్నాడు రమణరావు.

కసితీరా తండ్రిని తిట్టనిచ్చి_అప్పుడు నెమ్మదిగా వివరాలు చెప్పింది యమున. తను తల్లిని కాబోతున్న విషయం అబద్ధమని చెప్పింది కానీ కాలుజారిన సంగతిమాత్రం ప్రత్యేకించి చెప్పలేదు.

కూతురు చేసిన తప్పు ప్రమాదానికింకా దారి తీయలేదని_తెలియగానే రమణరావు ముఖంలో సంతోషం కనబడింది_ "వాడు_ఆ చంద్రభానుగాడు కామయ్య కొడుకు గదూ_..." అన్నాడు.

తలాడించింది యమున.

"రమణరావంటే ఏమిటో కామయ్యకు చెబుతాను" అంటూ ఆక్రోశించి కదిలాడు రమణరావు.

3

"ఓహో_ ఆ ఇంటర్వ్యూకా మీరు బయల్దేరారు?" అన్నాడు మీసాలతను చిన్నగా నవ్వుతూ.

"మీరూ ఆ ఇంటర్వ్యూకేనా?" అన్నాడు బాబా నీరసంగా.

"ఆ ఇంటర్వ్యూకే_ కానీ ఉద్యోగానికి కాదు. అభ్యర్థులను ఎన్నిక చేయడానికి__" అన్నాడు మీసాలు హుందాగా.

బాబాకర్థమైపోయింది. అతను క్షణంసేపు మాట్లాడలేదు. ఏం మాట్లాడాలో తోచలేదు. చూడగానే తెలుస్తోంది_ఈ మీసాలు పెద్ద హోదాలో ఉన్నాడని. అయితే ముఖమే అంత నచ్చుబాటుగా లేదు. విలన్‌లా ఉన్నాడు. కానీ మీసాలు తల్చుకుంటే తనకుద్యోగం వస్తుంది. వస్తే తన జీవితమే మారిపోతుంది.

ట్రయిన్ కడియం దాటుతోంది. "వచ్చేస్తోంది రాజమండ్రి!" అన్నాడు శ్రీనివాస్.

"సార్!" అన్నాడు బాబా _"ఎలా చెప్పాలో నాకు చేతకాదు. సూటిగా అడిగేస్తున్నందుకు మన్నించండి. నాకా ఉద్యోగం వచ్చేలా మీరు చూడాలి..."

మీసాలు నవ్వుతూనే "మీరలాగడగడంలో తప్పులేదు. నేనే స్వయంగా నా గురించి చెప్పకపోతే మీరు నన్నేమీ అడిగివుండేవారు కాదు. కానీ ఉద్యోగమివ్వడం ఒక్క నా చేతుల్లోనే లేదు. ఇంటర్వ్యూబోర్డులో శంకర్రావుగారని ఒక చండశాసనుడున్నాడు. ఆయన అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పనివాడికి ససేమిరా ఉద్యోగం ఇవ్వడానికి వీల్లేదంటాడు. ఎటొచ్చీ కాస్త

ముందుగానే ఆయన్ను కలుసుకుని కష్టం చెప్పుకుంటే మనిషి కరుగుతాడు. తనేం ప్రశ్నలడుగుతాడో చెబుతాడు. నేనిప్పుడు శంకర్రావుగారింటికే వెడుతున్నాను. మీరుకూడా ట్రెయిన్ దిగగానే నాతోపాటు బయల్దేరి వస్తే మిమ్మల్నాయనకు పరిచయం చేస్తాను'' అన్నాడు.

''నాతో ఎందుకు బయల్దేరానా అని ఏడ్చావ్ ఇప్పుడు చూడు. నీ గొట్టి విరిగి నేతిలో పడింది'' అన్నాడు శ్రీనివాస్.

బాబా మాట్లాడలేదు. అతని మనసునిండా సంతోషమే ఇప్పుడు. మీసాలుకు థాంక్స్ చెప్పి అతను కలలు కనబోతూ ట్రయిన్ రాజమండ్రి స్టేషన్లో ఆగగానే ఈ లోకంలోకి వచ్చేశాడు.

స్టేషన్ బయటకు రాగానే వీళ్ళ ముగ్గుర్నీ రిక్షావాళ్ళు చుట్టేశారు.

''ప్రకాషనగర్'' అన్నాడు మీసాలు ఒక రిక్షాలో కూర్చుంటూ. అతని పక్కనే బాబా కూర్చున్నాడు. శ్రీనివాస్ ఇల్లు స్టేషన్కు దగ్గర్లోనే ఉంది. బాబాకు సంబంధించిన ఎయిర్ బ్యాగు భుజానికి తగిలించుకుని తన బ్రీఫ్ కేస్ చేత్తో పట్టుకుని అతను రోడ్డుమీదకు నడిచాడు.

రిక్షా ఇన్నీస్ పేట వరకూ వచ్చేక మీసాలు ''అన్నట్లు మనమిప్పుడు వెళ్ళవలసింది శంకర్రావుగారింటికి కదూ అలవాటు ప్రకారం బంధువులుండే పేట చెప్పేశాను'' అని బాబాతో చెప్పి ''అ డబ్బులే యిచ్చేస్తాను. రిక్షా మూడు లాంతర్ల జంక్షన్ దగ్గర ఆపు చేసేయ్'' అన్నాడు రిక్షావాడితో.

రిక్షా మూడు లాంతర్ల జంక్షన్ దగ్గర ఆగింది. అక్కడ

నుంచి పక్క సందులోకి తీసుకుపోయాడు బాబాని మీసాలు. ఆ సందులో ఒక చిన్న పెంకుటిల్లు ముందర ఆగి తలుపుతట్టాడు మీసాలు.

తలుపుతీసిన వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాడు బాబా. మనిషి లావుగా బలంగావున్నాడు. నున్నగా గీసిన గుండు. తన పక్కనున్న వ్యక్తికంటె పెద్దమీసాలు. ఎర్రనికళ్ళు చూపులు భయంకరంగా ఉన్నాయి. చొక్కా వేసుకో లేదు. పువ్వులలుంగీ దాన్ని పటకా బెల్టుతో బిగించాడు. మీసాలుతోపాటు అతను లోపల అడుగు పెట్టేక— "ఈయన శంకర్రావు" అన్నాడు మీసాలు.

బాబా చుట్టూ చూశాడు. ఆ గుండు భయంకరుడు తప్ప ఇంకెవ్వరూ లేదాగదిలో. ఇంటర్వ్యూ బోర్డు మెంబరు శంకర్రావు అలా వుంటాడంటే బాబాకు మన సొప్పలేదు.

4

రమణరావు తలుపుతీసి గదిలోకి వెళ్ళాడు. మళ్ళీ తలుపులు మూశాడు.

ఇంట్లో ఆయన ప్రత్యేకపు గది అది.

ఆ గదికి మూడు గోడల్లో బీరువాలు తాపడం చేయబడి వున్నాయి. చూసి అక్కడ బీరువాలున్నాయని తెలుసుకోవడం సాధ్యం కాదు.

బీరువాకు తాళం పెట్టవలసిన చోట వున్న రంధ్రం కనబడకుండా డెకరేషన్ బొమ్మలు తగిలించారు. ఆబొమ్మ తీస్తే అక్కడ చిన్న మేకువుంటుంది. ఆ మేకు బలంగా వుంటుంది. దాన్ని తిప్పడానికి రెంచివంటి సాధనముంది రమణరావు దగ్గర. ఆ రెంచితో తప్ప ఆ మేకును తిప్పడం

సాధ్యంకాదు. ఆ మేకును ఎడమవైపు కొన్నిసార్లు కుడివైపు కొన్నిసార్లు అని ఏదో కోడ్ లెక్క వుంది. అప్రకారం తిప్పితే బీరువా తెరుచుకుంటుంది.

రమణరావు మొదటి బీరువా తెరిచి డబ్బు లెక్కపెట్టాడు. అన్నీ వందరూపాయల నోట్లు. పన్నెండు లక్షలున్నాయి. ఆయన నిట్టూర్చి 'ఇంత డబ్బుండీ ఇలా మామూలు జీవితం గడపాల్సి వస్తోంది' అనుకున్నాడు.

ఆ బీరువా మూసేసి రెండో బీరువా తెరిచాడు. దాని నిండా ఏవేవో కాగితాలు, ఫోటోలు వున్నాయి. అవి చూసి రమణరావు అదోలా నవ్వుకున్నాడు.

అవి ఆ నగరంలోని ప్రముఖులకు సంబంధించిన రహస్య పత్రాలు, ఫోటోలు. వీటి సాయంతో రమణరావు బ్లాక్ మెయిల్ చేసి డబ్బు సంపాదిస్తూంటాడు.

రమణరావు స్మగ్లర్ అని చాలామందికి తెలుసును కానీ బ్లాక్ మెయిలర్ అని ఎవరికీ తెలియదు. అందుకు కారణం ఏమీ లేదు. ఆయన తనకు తానై ఎవరినీ బ్లాక్ మెయిల్ చేయలేదు. పోస్టులో ఫోటోలు పంపుతాడు. డబ్బు తీసుకునే విధానం అత్యంత విచిత్రమైనది.

నగరంలో గోదావరి ఒడ్డున ఒక పార్కులో నోరు తెరిచిన రాక్షసుడి విగ్రహం వుంది. ఆ విగ్రహం నోట్లో డబ్బు వేయమని ఆయన రాస్తాడు. ఆ విగ్రహానికి బొడ్డు దగ్గర ఉన్న కన్నంలో తాళం చెవి పెట్టి తిప్పితే పొట్ట మీద తలుపు తెరుచుకుంటుంది. ఏదో అర్ధరాత్రి సమయంలో ఎవరికీ తెలియకుండా తన డబ్బు తను తెచ్చుకుంటాడు.

ఆ విగ్రహాన్ని ఆ పార్కులో పదిహేనేళ్ళ క్రితం ఒక

ప్రముఖుడు ప్రతిష్ఠింపజేశాడు. రమణరావు ఆ విగ్రహాన్ని తయారు చేస్తున్న శిల్పిని కలుసుకుని తన కోరిక మేరకు ఆ విగ్రహాన్నివిధంగా తయారు చేయించాడు. అందుకా శిల్పికి రమణరావునుంచి పదివేలరూపాయలు బహుమతిగా లభించాయి.

కానీ విగ్రహం ప్రతిష్టించిన రెండ్రోజులకాశిల్పి అనుమాన పరిస్థితులలో మరణించాడు. పోలీసులు కేసురిజిస్టర్ చేశారు కానీ ఫైలు ఏమాత్రం ముందుకు నడవలేదు. రమణరావు బ్లాక్ మెయిలింగ్ మాత్రం అద్భుతంగా కొనసాగిపోతోంది.

రమణరావు ఆ బీరువాకూడా మూసేసి మూడోది తెరిచాడు.

అందులో స్మగ్లింగ్ కు సంబంధించిన రకరకాల వస్తువులున్నాయి. వజ్రాలు, ముత్యాలు, నగలు కెమేరాలు వగైరాలు దానినిండావున్నాయి. రమణరావు ఆ బీరువాలోంచి చిన్న పెట్టె ఒకటి తీశాడు. అది తెరిచి అందులో తననుకున్నది వున్నదీ లేనిదీ చూశాడు. ఆ పెట్టె జేబులో వేసుకుని "చమన్ లాల్ తో ఈ రోజు దీని బేరం పైసలు చేసేయాలి. ఓ యాభైవేలు తక్కువైనా సరే—" అనుకున్నాడు.

5

కామయ్య టైము చూసుకున్నాడు. టైము ఉదయం పది గంటలైంది.

ఆయన కుర్చీలోంచి లేచి చొక్కా తొడుక్కుని ఇంటికి తాళం పెట్టి గోడ్డుమీదకు వచ్చాడు. చకచకా నడుచుకుంటూ ముందుకుసాగాడు.

దానవాయి పేటలో ఒక సందులోకి తిరిగాడాయన.

ఆ సందులో కామయ్యగారికి ఇంకో ఇల్లుంది. ఆ ఇల్లు అద్దెకిచ్చేశాడాయన. ఒకే ఒక గదిమాత్రం తనకోసం అట్టే పెట్టుకున్నాడు. ఇప్పుడాయన సరాసరి ఆ ఇంట్లోని ఆ గది లోకే వెళ్ళాడు. అది ఆ ఇంటి వీధిగది.

కామయ్య గది తలుపులు వేసుకుని గోడవారగావున్న పెట్టితీసి పక్కన పెట్టాడు. ఆ పెట్టిక్రింద లూజుగా పెట్టి వున్న రాతి పలకను తీశాడు. అక్కడ పడగవిప్పి ఆడు తున్న పామును చేత్తో పట్టుకుని తీసి బయట పెట్టాడు. అది రబ్బరుపాము.

మళ్ళీ ఆ పలక క్రిందస్థలంలో ఆయన చెయ్యి పెట్ట బోతుండగా ఎవరో గది తలుపులు తట్టారు.

కామయ్య కంగారుగా పామునీ, ఆ తర్వాత పలకనీ యథాస్థానంలోకి మార్చేసి దానిమీద పెట్టిపెట్టేసి వెళ్ళి తలుపు తీశాడు. ఆగంతకుడాయనకు పరిచయమైనవాడు కాడు. అతని కళ్ళు ఎర్రగానున్నాయి. అతనికి పెద్ద మీసాలున్నాయి. నల్లపాంటుమీద తెల్లషర్టు వేసుకుని వున్నాడు. వయసు ముప్పై సంవత్సరాలకు మించి వుండదు.

ఆగంతకుడు చటుక్కున లోపలకువచ్చి గది తలుపులు మూసి "కామయ్యగారూ నమస్కారం. మీరు అరవ డానికి ప్రయత్నించవద్దు. నా చేతిలోని రివాల్వర్‌కు సైలెన్సర్ అమర్చబడివుంది. అది మీరు అల్లరిచేసినప్పుడు మాత్రమే పనిచేస్తుంది" అన్నాడు.

కామయ్య తెల్లబోయి అతని వంక చూస్తూంటే అతను తలుపు గడియవేశాడు. "నేనెవరా, ఎందుకు వచ్చానా అని ఆలోచిస్తున్నారు కదూ. మీ సందేహాలు తీర్చవలసిన

అవసరం నాకుంది. ఉపోద్ఘాతాలతో సమయం వృథా చేయడం నాకిష్టంలేదు. గజదొంగ గంగన్న గురించి మీరు వినేవుంటారు. అతను దోచిన సొత్తు పోలీసులకు పట్టుబడే లోగా మీ చేతుల్లో పడిందని నాకు తెలుసు. వెంటనే దాన్ని నాకప్పగించి మీ ప్రాణాలు దక్కించుకోండి."

రామయ్య ఆశ్చర్యంగానూ, భయంగానూ ఆగంతుకుని చూసి "మీరంటున్న మాటల కర్థం నాకు తెలియడం లేదు" అన్నాడు.

"నటనలు కట్టిపెట్టండి. గది తలుపు సందులోంచి నేనంతా చూశాను. అదిగో ఆ పెట్టెక్రింద ఏముందో చూడ నివ్వండి" అన్నాడు ఆగంతకుడు.

ముందు తడబడినా తర్వాత నవ్వేశాడు రామయ్య. "మీరెవరో నాకు తెలియదు. నా దగ్గర దొంగ సొమ్ముందని ఎవరు చెప్పారో నాకు తెలియదు. నేనొక వడ్డీ వ్యాపారిని. అదే నా జీవనోపాధి. ఈ వ్యాపారం చేసుకునే వాళ్ళందరికీ కొన్ని నమ్మకాలుంటాయి. చూసే వాళ్ళకవి మూఢనమ్మకాల్లా కనపడవచ్చు. మా తాతల కాలంనుంచీ లక్ష్మీదేవిని భూమిలో దాచి కాపలాగా నాగుపామును పెట్టడం మా ఇంటి ఆచారంగా వస్తోంది. వినాయకుడి పూజచేసేవారు యథాశక్తి బంగారంలో కానీ, వెండిలో కానీ లేక మట్టిలోకానీ విగ్రహం తయారు చేసి పూజ చేసుకోవచ్చుగదా - నేను లక్ష్మీదేవి పేరిట రెండు ఇనుప గొట్టాలు - వాటికి కాపలాగా ఒక రబ్బరు పామువుంచాను చూడండి" అంటూ ఆగంతకుడిని తీసుకు వెళ్ళి చూపించాడు.

ఆగంతకుడు ఇనుప గొట్టాలను పరిశీలించి చూశాడు.

అవి గట్టిగావున్నాయి, ఒక్కొక్కటి అరంగుళాల పొడ వున్నాయి. సుమారు అంగుళం మందంలోవున్నాయి. వాటిలో అతనికేమీ విశేషం కనబడలేదు.

"మీ దగ్గర ఆ సొమ్ము ఉన్నట్లు నాకు చాలా నమ్మకంగా తెలిసింది. అందుకే ఉదయమే మీ ఇంటివద్ద కాపలా కాశాను. మీరు బయటకురాగానే మిమ్మల్ననుసరిస్తూ వచ్చాను. అనుమానపరిస్థితుల్లో మీరిక్కడ కనపడగానే సొమ్ము దొరికిందనే అనుకున్నాను. ఇందులో ఏదో తిరకాసుంది. సొమ్ముదొరికేదాకా మిమ్మల్ని వదిలిపెట్టను" అన్నాడాగంతకుడు.

"సరే అంతా బాగానేవుంది. ఇంతకీ ఆ గజదొంగ గంగన్నెవరు? ఆ సొమ్మేమిటి? అది నా దగ్గర ఉండడమేమిటి? అన్నీ కాస్త వివరంగా చెబుతారా?" అన్నాడు కామయ్య.

అతను చిరాగ్గా కామయ్యవంక చూసి "తెలిసుండీ ప్రశ్నలు వేసేవాళ్ళంటే నాకు చాలా చిరాకు అయినా చెబుతాను వినండి" అంటూ పరిస్థితి వివరించి "మీ అన్నయ్యగారబ్బాయి బాబా చెప్పాడు. ఆ సొమ్ము మీ దగ్గరున్నదనీ మీరు చాలా పిసినారి అనీ ప్రాణాలు పోయినా అసలుసంగతి చెప్పరనీను. ప్రాణాలు తీయడం నాకు కొత్తకాదు. సొమ్ము సంగతి తెలియకపోతే ప్రాణాలు తీయడం ఈ క్షణంలో జరిగినా ఆశ్చర్యంలేదు, మీరింకేం చెప్పినా నేను నమ్మను" అన్నాడు.

అతని మాటల్లో కరకుదనం, చూపుల్లో కర్కశత్వం అన్నంత పనీ చేస్తానని కామయ్యకు తెలియజేసాయి. బాబా ఆయనకు స్వయాన అన్నకొడుకు. అన్నగారు

పోయినప్పుడు బాబా అతని తల్లి తన ఆశ్రయం కోరితే ఆయన నిరాకరించాడు. ఒక్క రూపాయైనా సహాయం చెయ్యడానికి నిరాకరించాడు. బాబా ఆయనమీద పగ బట్టాడు.

అతని తల్లిపోయినప్పుడు మరోసారి వచ్చాడు. సాయానికి వచ్చాడేమో అనుకుని చిల్లిగవ్వ ఇవ్వనుపో అన్నాడు తను.

అప్పుడు బాబా "నువ్విచ్చేవని ఎలాగ తెలుసు. నేను వచ్చింది సాయంకోసంకాదు. సమయం వచ్చినప్పుడు నీమీద దారుణంగా పగ తీర్చుకుంటానని చెప్పిపోవడానికి" అని చెప్పి వెళ్ళిపోయాడు.

అప్పుడు వాడి వయసు పదేళ్ళుంటుందేమో! ఎవడో గూండా వెధవకి తప్పుడు సమాచారమందజేసి ఇప్పుడిలా పగ తీర్చుకున్నాడన్న మాట. అయితే తనేనా అంత తెలివితక్కువ వాడు. ఈ ఉపాయాన్నే తన శత్రువు మీదకు మళ్ళించాలి.

"చూడండి బ్రతకవలసినంత కాలం బాగానే బ్రతికాను నేను. జీవితం గురించి నాకట్టే బెంగలేదు. నన్ను నమ్మనని అంటున్నారు. కానీ గజదొంగ గంగన్న దోచిన సొమ్ము ఎక్కడున్నదో నాకు తెలుసు. నన్ను చంపినా మీకా సొత్తు దొరకదు. కానీ నా మాటలు నమ్మితే మీకు సమాచారం తెలుస్తుంది" అన్నాడు కామయ్య తాపీగా.

"ఎక్కడుంది?" అన్నాడాగంతకుడు.

"రమణరావు తెలుసా మీకు?" అన్నాడు కామయ్య.

6

నిరుత్సాహంగా పార్క్ బెంచిమీద కూర్చున్నాడు బాబా.

తను చాలా దురదృష్టవంతుడు. ఇంటర్వ్యూ అయి పోయేకగానీ తనకా మీసాలు నించి విముక్తి లభించలేదు. అన్నిటికీ చెడ్డవాడయ్యాడు తను.

గంగన్న దోచిన సొమ్ము తన ఉద్యోగం పోగొట్టేసింది. అతను శ్రీనివాస్ ఇంటికి వెళ్ళలేదు. మీసాలు చెప్పిన ప్రకారం ఇలా పార్కులోకి వచ్చేశాడు.

వదిలేముందు మీసాలొక హెచ్చరిక చేశాడు. తనింకా వారంరోజుల పాటు ఈ రాజమండ్రిలోనే వుండాలిట. రోజూ సాయంత్రం ఏడుగంటలకు మీసాలింటికి వెళ్ళి హాజరు వేయించుకోవాలిట. లేకపోతే వెతికివెతికి ప్రాణాలు తీసేస్తాడట ప్రస్తుతం తను మీసాలు చెప్పిన పని ఒకటి చేయాలి...

గంగన్న సొమ్ముగురించి ఎంత అడిగినా తనకు తెలియదని చెప్పేసరికి మీసాలుకు చాలా కోపం వచ్చింది. వాడింక తనను యమయాతనలు పెట్టబోతున్నాడని తెలిసేక బాబాయి గుర్తుకొచ్చాడు. బాబాయిమీద పగ తీర్చుకునేటందుకిదే మంచి సమయమనిపించింది. అప్పటి కప్పుడు ఆలోచించి ఒక కట్టుకథ అల్లాడు. వాడెంత వరకూ అది నమ్మాడో తెలియదు కానీ తనను బాధలు పెట్టలేదు.

బాబా చటుక్కున లేచి నిలబడ్డాడు. తన జేబులోంచి ఫోటోతీసి చూశాడు. అప్పుడే పార్కులో ప్రవేశించి దిగాలుగా కూర్చున్న ఆ అమ్మాయే తనకు కావాలి.

అతను చకచకా నడిచి ఆ అమ్మాయి దగ్గరకు వెళ్ళాడు. ఆమె ఏదో ఆలోచిస్తూ కూర్చుంది. ఇతన్ని గమనించలేదు.

"మేడమ్—" అన్నాడు బాబా. ఆమె ఉలిక్కిపడి తలెత్తి చూసింది.

"రాధా!" అన్నాడతను అప్రయత్నంగా అన్నట్లు.

"నా పేరు రాధకాదు యమున" అందామె.

"యమునకు రాధకు అవినాభావ సంబంధముంది. యమున ఒడ్డునే రాధ కృష్ణుడిని కలుసుకునేది" అన్నాడు బాబా.

"మిస్టర్—ఎవరున్నువ్వు?" అంది యమున.

"అదే కంఠం—నువ్వు రాధవే—" అన్నాడు బాబా.

వాళ్ళిద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకునేటందుకు ఓ అయిదు నిమిషాలు పట్టింది. బాబా తన విషాద గాథను చెప్పాడు. అతను రాధ అనే అమ్మాయిని ప్రేమించాడు. ప్రేమ వివాహానికి దారితీయకమునుపే టైఫాయిడ్ వచ్చి రాధ మరణించింది. అప్పట్నించీ అతను పిచ్చివాడిలా ఊళ్ళు పట్టి తిరుగుతున్నాడు. ఇన్నాళ్ళకు చనిపోయిన రాధ మళ్ళీ తన కళ్ళ ఎదుట నిలబడింది. కానీ ఆమె రాధను కానంటోంది.

బాబా తన జేబులోని ఫోటో అందించాడు యమునకు. యమున ఫోటో చూసి ఆశ్చర్యపడింది— "ఇది నాదే—" అంది.

"చూశావా నువ్వు రాధవు—" అన్నాడు బాబా.

యమున పరిశీలనగా బాబాను చూసింది—అతని కళ్ళలో గూడుకట్టుకున్న విషాదం ఆమెను కదిలించింది. అతడు చెప్పే కథ నిజమేననిపించిందామెకు.

"నీ రాధకోసమే నువ్విలాగైపోయావా?" — అంది జాలిగా అతన్ని చూస్తూ ఆమె.

"అవును. ఇంకెంతో కాలం బ్రతకను కూడా—" అన్నాడు బాబా.

అతను ప్రేమలో దెబ్బ తిన్నాడు. విధి అతన్ని మోస గించింది. తనూ ప్రేమలో దెబ్బతింది. తనకొక మనిషి మోసగించాడు. ఇద్దరూ ప్రస్తుతం ఒకే స్థితిలో ఉన్నారు. ఆమెకు అతనితో తన కథ చెప్పుకోవాలనిపించింది.

బాబా ఆమె కథ విని— "నా రాధ మళ్ళీ కనబడు తుందని నేననుకోలేదు. నీ పేరు యమున కావచ్చు. కానీ నాకు నువ్వు రాధవే. నీ గత చరిత్రతో నాకు సంబంధం లేదు. నిన్ను పెళ్ళి చేసుకుంటాను. ప్రస్తుతం పైసా సంపా దన లేదు. కానీ నువ్వు నాకు భార్యగా మారితే ఆ బాధ్యతను నిర్వహించుకోవడానికెంతైనా సంపాదించ గలను—" అన్నాడు.

అతని మాటలు వింటూ యమున తన్ను తాను నమ్మలేక పోయింది. బాబా చూడ్డానికి చాలా అందంగానే వున్నాడు. తన గత చరిత్ర తెలిసికూడా తననే వరిస్తా నంటున్నాడు. ఇతనిది నిజమైన ప్రేమ!

"ఇక్కడ నా చుట్టాలింట్లో ఉంటున్నాను—రాధతో నేను తీయించుకున్న ఫోటోలన్నీ ఒక ఆల్బంలో పెట్టి ఎక్కడకు వెడితే అక్కడకు తీసుకు వెడుతుంటాను. ఇప్పుడు నాతో వస్తే అవి చూపిస్తాను—" అన్నాడు బాబా.

యమున సందేహించలేదు—"పద!" అంది.

రిక్షాను పిలిచి— "మూడు లాంతర్ల జంక్షన్" అన్నాడు.

ఇద్దరూ మూడు లాంతర్ల జంక్షన్ దగ్గర దిగారు. అక్కడినించి పక్క సందులోకి వెళ్ళారు యమున, బాబా. ఆ సందులో ఒక చిన్న పెంకుటిల్లుముందర ఆగి తలుపు తట్టాడు బాబా.

తలుపులు తెరుచుకున్నాయి కానీ ఎవరు తెరిచినదీ కనిపించలేదు.

"రా...రాధా..." అన్నాడు బాబా. యమున అతన్ననుసరించింది.

లోపల దీపం వెలుగుతోంది. ఇల్లు మామూలు మధ్య తరగతి వాళ్ళ కొంపలా ఉంది.

యమున అనుమానంగా చుట్టూ పరిశీలించి చూసి- "ఇంట్లో జనమున్న అలకిడి ఏమీ లేదే-" అంది.

"నా రాధ నా ప్రాణం. నీకేమీ భయంలేదు-" అన్నాడు బాబా.

సరిగ్గా అప్పుడే ఇంటి తలుపులు మూసుకున్నాయి. అంతవరకూ తలుపుల వెనుకనున్న వ్యక్తిని అప్పుడే చూసిన యమున ఉలిక్కిపడింది.

అతను బాబా ఇదివరలో చూసిన గుండు భయంకరుడు. అతను యమునను చూసి నవ్వుతున్నాడు కానీ – చూపులు మాత్రం భయంకరంగా ఉన్నాయి.

7

"నా పేరుతో మీకు నిమిత్తంలేదు. మీ పేరు రమణరావు కదా-మీతో నాకు పని వుంది" అన్నాడతను.

"ఏం పని?" అన్నాడు రమణరావు ఆ వ్యక్తి వంక ఆశ్చర్యంగా చూస్తూ.

"గంగన్న సామ్మ..." అన్నాడాగంతకుడు.

"ఎవరా గంగన్న?"– అన్నాడు రమణరావు చిరాగ్గా.

ఆగంతకుడొకసారి తన మీసాలు దువ్వి– "ప్రస్తుతం జైల్లో మగ్గుతున్నాడు కానీ అతనెందుకు జైలుకెళ్ళాడో, ఆ కారణం మీదగ్గరుంది......" అన్నాడు.

"ఓహో–గజదొంగ గంగన్న సంగతా–అతగాడి సొమ్ము కనీసం కొన్ని కోట్లయినా ఉంటుందని చెప్పుకుంటారు. దాంతో మీకేం పని?" అన్నాడు రమణరావు.

"అది నాకు కావాలి!"

"నాకూ కావాలి. ఎక్కడుందో చెప్పండి. ఇద్దరం వెళ్ళి తెచ్చుకుందాం." అన్నాడు రమణరావు.

"మిస్టర్ రమణరావ్–నాతో వేళాకోళాలు వద్దు. నాతో చెలగాటం ప్రాణాలుతీస్తుంది. మీరింకేం చెప్పినా నేను వినను. మీ దగ్గర గంగన్న సొమ్ము ఉన్నదని నాకు దూఢిగా తెలిసింది. వెంటనే చెప్పి మర్యాద, ప్రాణాలు దక్కించుకోండి" అన్నాడతను క్రూరంగా.

"మీ పేరేమిటో తెలుసుకోవచ్చా?" అన్నాడు రమణరావు.

"తెలుసుకుని ప్రయోజనం లేదు" అన్నాడాగంతకుడు.

"పిలవడానికి పేరు చాలా అవసరం. చెప్పడం మీ కిష్టంలేకపోతే మీ వేషాన్ని బట్టి నాకు తోచిన పేరుతో పిలవాల్సి వుంటుంది–" అన్నాడు రమణరావు.

"అభ్యంతరం లేదు. గంగన్న సొమ్ము ఎక్కడుందో చెప్పండి......"

"అయితే మిస్టర్ మీసాలూ–నాతో రండి. గంగన్న సొమ్ము ఎక్కడుందో చూపిస్తాను. నాతో రావడానికి మీకేమీ భయంలేదు కదా..." అన్నాడు రమణరావు.

"నాకు భయమెందుకూ_సరిగ్గా ఇంకో రెండు గంటలకు నేను ఇల్లు చేరకపోతే మీ అమ్మాయి యమున శవంగా మారి ఇక్కడికి చేరుకుంటుంది..." అన్నాడు మీసాలు తాపీగా.

రమణరావు ఉలిక్కిపడ్డాడు. "ఏమిటి నువ్వనేది?"

"నేను తెలివితక్కువగా ఇక్కడికి రాలేదు_నీ కూతురు ప్రస్తుతం నాకు బందీగా వుంది." అన్నాడు మీసాలు గర్వంగా నవ్వుతూ.

రమణరావు ముఖం దీనంగా మారిపోయింది. "నాకున్నదల్లా ఒకత్తే కూతురు. దానికే ఆపద వచ్చినా నేను సహించలేను. దాన్నేమీ చేయకు..."

"ఏమీ చేయను...కానీ గంగన్న సొమ్ము నాకప్పజెప్పాలి..."

రమణరావు ఆలోచించి_ "అంత డబ్బు ఒక్కసారిగా అప్పజెప్పాలంటే ఎవరికైనా బాధగానే ఉంటుంది. నీ క్కావాలంటే కొంత వాటా ఇస్తాను..." అన్నాడు.

"చాలదు. అంతా కావాలి. అప్పుడే నీ కూతురు సురక్షితంగా నిన్ను చేరుతుంది."

రమణరావు చేసేది లేనట్లు ముఖంపెట్టి_"డబ్బెక్కడున్నదీ నీకు నేను చెబుతాను. అది కాస్తా కూస్తా సొమ్ము కాదు. కాబట్టి నాకు కనీసం పది లక్షలైనా నువ్వివ్వాల్సి వుంటుంది..." అన్నాడు.

"అవన్నీ తర్వాత మాట్లాడుకుందాం. ముందు డబ్బు సంగతి చెప్పు."

"చెబుతాను కానీ_నా కూతురు నీ దగ్గరుందని గ్యారంటీ ఏమిటి? ఉన్నా దాన్ని వదిలిపెడతావనీ

గ్యారంటీ ఏమిటి?'' అన్నాడు రమణరావు.

మీసాలు అసహనంగా– ''మాటలతో కాలయాపన చేద్దామని చూస్తున్నట్లున్నావ్. ఇలాంటివి నాకు కిట్టవు. నేను చెప్పినవన్నీ నువ్వు నమ్మాల్సిందే...'' అన్నాడు.

రమణరావు నవ్వి– ''నేను చాలా మొండి మనిషిని. నా కూతురు నా దగ్గరకు సురక్షితంగా చేరుతుందని నమ్మకం లేకపోతే నేను నీకేమీ చెప్పను. నా ప్రాణాలు తీసినా నువ్వు సాధించేదేమీ లేదు. గంగన్న సొమ్ము గురించి గంగన్న తర్వాత తెలిసినవాడిని నేనొక్కడినే.....'' అన్నాడు.

మీసాలు ఆలోచనలో పడినట్లున్నాడు. యమునను వదిలిపెడితే రమణరావు తనకసలు విషయం చెప్పక పోవచ్చు. వదలకపోతే మొదలే చెప్పనట్టున్నాడు. గంగన్న సొమ్ము గురించి ఇతగాడికి తెలిసినట్లే కనబడు తోంది.

''ఏంచేయాలో నువ్వే చెప్పు...'' అన్నాడు మీసాలు.

''నా కూతురెక్కడుందో అక్కడికి తీసుకువెళ్ళు. విషయం నీకు చెప్పేస్తాను. మమ్మల్నిద్దర్నీ వదిలిపెడుదువు గాని...'' అన్నాడు రమణరావు.

మీసాలు క్షణం ఆలోచించి, ''సరే, అలాగే జరుగు తుంది. సాయంత్రం మళ్ళీ వస్తాను...'' అన్నాడు.

8

''నమస్కారం బంగార్రాజుగారూ. మీకు చాలా ముఖ్యమైన సమాచారం అందించడానికి వచ్చాను...'' అన్నాడు రమణరావు.

''ఏమిటది?''– అన్నాడు బంగార్రాజు.

"పార్కులో రాక్షసుడి విగ్రహం మీ ప్రాణాలు తీసేస్తోందనీ—దాన్నక్కడినుంచి తొలగించడానికి మీరు ఛైర్మన్ గారితో ఎన్నో సంప్రదింపులు జరిపాననీ-కానీ బ్లాక్ మెయిలర్ హెచ్చరిక కారణంగా ఆ విగ్రహంజోలికి ఎవ్వరూ వెళ్ళలేకపోతున్నారనీ నాకు తెలిసింది. ఇప్పుడు శుభవార్త ఏమిటంటే నాకా బ్లాక్ మెయిలర్ ఆచూకీ తెలిసిపోయింది. వాడినీ రోజు రాత్రికే రెడ్ హాండెడ్ గా మనం పట్టుకోవచ్చు. ఈ విధంగా ఆ విగ్రహాన్నికూడా అక్కణ్నించి తొలగించే ఏర్పాటు చేయవచ్చు" అన్నాడు రమణరావు.

బంగార్రాజు ముఖం వెలిగింది. "నాలాంటి వాళ్ళం నాకు తెలిసినంతవరకూ ఓ పదిమందిదాకా వున్నాం. అంతా కలిశామంటే..."

"వాడిదగ్గర మీ రహస్యాలు చాలావున్నాయి కాబట్టి ఇందులో పోలీసులజోక్యం ఉండకూడదు" అన్నాడు రమణరావు.

"అసలింతకీ ఏం జరిగింది?"

"వాడు నా కూతుర్ని ఎత్తుకుపోయాడు. తర్వాత నా దగ్గరకొచ్చి పార్కులోవున్న రాక్షసుడి విగ్రహానికి తాళం చెవి తన దగ్గర వుందని ఈ రాత్రికి ఆ విగ్రహంలోని డబ్బు తీసుకోవాలనీ అందుకు నా సాయం కావాలనీ చేయని పక్షంలో నా కూతుర్ని చంపేస్తాననీ అన్నాడు..."

"ఎలాగుంటాడు వాడు...?"

వర్ణించి చెప్పాడు రమణరావు. "వాడు నా దగ్గర కొచ్చి ఇలా అనగానే నాకు మతిపోయింది. కాసేపు ఆలో

చించి ముందు నా కూతుర్ని చూపిస్తే ఒప్పుకుంటానన్నాను. సాయంత్రం వస్తానని వెళ్ళిపోయాడు. పోతూపోతూ వీధి తలుపులు వేసిపోయాడు. మీ వాళ్ళెవరైనా ఇద్దరు మనుషుల్నివ్వండి. రహస్యంగా వెంటాడడంలో నేర్పుతో పాటు అవసరమైతే మనుషుల్ని చావుదెబ్బ తీయగలిగేలా వుండాలి.''

బంగారాజు తలూపేడు.

రమణరావు ఉత్సాహంగా 'ఒక దెబ్బకు రెండు పిట్టలు!' అనుకున్నాడు.

రాక్షసుడి విగ్రహంమీద గత సంవత్సరంలోనూ నిఘా ఎక్కువైంది. ఇది యిక ఎంతోకాలం సాగదని ఆయనకు తెలిసిపోయింది. తెలివిగా అనుమానాన్ని ఎవరైనా కొత్త వ్యక్తిమీదకు మళ్ళించి తను బ్లాక్ మెయిలింగ్ డబ్బు వసూలుచేసే పద్ధతి మార్చాలని ఆయన అనుకుంటున్నాడు ఇప్పుడిలా అవకాశం వెతుక్కుంటూ వచ్చింది.

9

బంగారాజు మనుషులిద్దరికీ ''ఒక మీసాలవ్యక్తి ఇప్పుడిక్కడికి వస్తాడు. కొద్ది నిముషాలు మాట్లాడుకుని ఇద్దరం బయటకు వెడతాం. ఎవరికీ అనుమానం రాకుండా మమ్మల్ననుసరించండి. మేమిద్దరం ఒక ఇంట్లోకి వెడతాం. అందులోంచి అరగంటలోగా నేను బయటకు రాకపోతే మీరూ ఆ ఇంట్లో ప్రవేశించండి...'' అని చెప్పాడు రమణరావు.

తర్వాత మీసాలు వచ్చాడు. రమణరావుని పద మన్నాడు. ఇద్దరూ రిక్షా ఎక్కారు. రిక్షా మూడు లాంతర్ల జంక్షన్ దగ్గర ఆగింది. ఇద్దరూ దిగి దగ్గర్లో నేవున్న సందు

లోకి నడిచి ఒక పెంకుటింట్లోకి వెళ్ళారు.

రమణరావుకి అక్కడ తన కూతురు యమున కనిపించింది. వాళ్ళతోపాటు అక్కడ బాబా, గుండు భయంకరుడుకూడా వున్నాడు.

రమణరావు తన జేబులోంచి ఒక తాళంచెవి తీసి మీసాలుకిచ్చి పార్కులో రాక్షసుడి విగ్రహం వివరాలు చెప్పాడు. అందులోనే గంగన్న తన డబ్బు దాచాడని కూడా చెప్పాడు.

మీసాలు తన మొలలోంచి ఒక పదునైన బాకు తీశాడు. రమణరావును సమీపించి ఆ చాకు పిడిని గట్టిగా పట్టుకుని వదిలేయమన్నాడు. అతనలా చేశాక "ఇంక నువ్వు నీ కూతురు వెళ్ళవచ్చు. ఈ విషయంలో నన్ను మోసగించినట్లు తెలిసిందంటే మాత్రం ఈ బాకుతో హత్య జరుగుతుంది. హంతకుడివి నువ్వేననడానికి తిరుగులేని బలమైన సాక్ష్యాలుంటాయి" అన్నాడు.

రమణరావు తడబడి "ఈ విగ్రహం గురించి ఊళ్ళో చాలామంది పెద్దలకు చూచాయగా అనుమానాలున్నాయి. దానిమీద చాలా నిఘావుండవచ్చునని నా అనుమానం. ఇంతవరకూ ఒక్కసారికూడా ఆ తాళాన్నుపయోగించే అవకాశం నాకు రాలేదు" అన్నాడు.

రమణరావు, యమున బయటకువచ్చారు. తర్వాత ఆయన తన మనుషులతో "మీరీ ఇంటిముందే కాపలా వుండండి. ఈ ఇంట్లోంచి ఒక రాత్రివేళ మీసాలవాడు బయటకువస్తాడు. ఆ తర్వాత మీరా ఇంట్లో జొరబడి ఎవరైనా లోపలుంటే వాళ్ళ నోళ్ళుమూసి ఆ ఇంట్లో ఎక్కడెక్కడేయే ఆయుధాలున్నాయో వెతికి వెతికి

అన్ని మాటగట్టుకుని నా దగ్గరకు తీసుకురండి'' అని చెప్పాడు.

10

మీసాలు, గుండు భయంకరుడు పార్కు దగ్గరకు వచ్చారు.

ఎక్కడా ఏమీ అలికిడి లేదు. పక్కనే ప్రవహిస్తున్న గోదావరి మీదనుంచి చల్లని గాలి వీస్తోంది. మీసాలు పరిసరాలను బాగా పరిశీలించి చూశాడు. అనుమానించవలసినదేమీ కనపడలేదు. అతను గుండు భయంకరుణ్ణి హెచ్చరించాడు.

''నువ్వు గేటుదగ్గరే వుండు. ఏ మాత్రం అనుమానం కలిగించే పరిస్థితి ఏర్పడినా నీ జేబులోని ఉండనుతీసి నేల మీద కొట్టు.''

తన అనుచరుణ్ణి కాపలా పెట్టి మీసాలు విగ్రహాన్ని సమీపించాడు. చిన్న రాతిపీఠంమీద నిలుచున్న నిలువెత్తు విగ్రహమది. మీసాలు తనవద్దనున్న తాళంచెవి విగ్రహం బొడ్లో పెట్టాడు. రమణరావు చెప్పిన విధంగా తిప్పాడు. తాళం విడింది. లాగగానే తలుపు తెరుచుకుంది.

మీసాలు బ్యాటరీలైట్ వేసి చూశాడు. లోపల వజ్రాలు, నగలు, రత్నాలు, ముత్యాలువున్నాయి. అతని కళ్ళు సంతోషంతో మెరిశాయి. 'రమణరావు నిజమే చెప్పాడు!' అనుకున్నాడు.

అది గజదొంగ గంగన్న దోచినసొమ్ము. ఒక్క రాత్రిలో పదిమంది నగల వర్తకుల ఇళ్ళు దోచేశాడతను. ఈ సొమ్ము విలువ కోట్లలో వుంటుందని చెప్పుకుంటారు. ఇంతసొమ్ము ఈ విగ్రహంలో దాచాడని తెలుసుండీ—

ఆ విగ్రహం తాళం తన దగ్గరనే ఉన్నప్పటికీ రమణ రావీసొమ్ము జోలికి వెళ్ళలేదు.

అందుకాకారణ మూహించడం పెద్ద కష్టంకాదు. ఇందులోని సొమ్ము ఈ ఊరి పెద్దలది. వారికి రమణరావు అంతరంగికుడని చెప్పుకుంటారు. ఈ నగలు, వజ్రాలు రూపాయలుగా మార్చాలంటే ఊరిపెద్దల సహకారం కావాలి. మరో విధంగా చేసేటంత, చేయగలిగేటంత పెద్దవాడిలా రమణరావు కనపడ్డంలేదు. అతని ఇల్లు తను చూడనేచూశాడు. చాలా సామాన్యంగావుంది.

ఆలోచనలతో మీసాలు సమయం వృధా చేసుకోదల్చ లేదు. అతను తన చేతిలోవున్న బ్రీఫ్ కేసులోకి అందులో వున్న నగలు వగైరా తరలించాడు. మళ్ళీ విగ్రహం తలుపు మూసి గేటుదగ్గరకు వచ్చాడు.

గుండు భంకరుడతన్ని చూసి నవ్వాడు. మీసాలు విజయసూచకంగా తలాడించాడు. ఇద్దరూ నెమ్మదిగా పార్కు ప్రాంతాలనుంచి బయటపడి ఒక సందులోకి తిరి గారు. హఠాత్తుగా ఇద్దరు మనుషులు వాళ్ళమీద పడి ముక్కులదగ్గర ఏదో బలంగా అదిమారు. అనుకోని ఆ పరిణామానికి మీసాలు, గుండు భయంకరుడు సిద్ధంగా లేరు. క్షణాలమీద వాళ్ళకు స్పృహతప్పింది.

11

"చాలా థాంక్స్ బంగార్రాజుగారూ సమాజానికి చీడపురుగులాంటి వాడిని పట్టుకున్నారు" అన్నాడు రమణరావు.

"సమాజానికి చీడపురుగు అన్నప్పుడల్లా నాకదోలా గుంటూంటుంది. దయుంచి నా దగ్గర ఆ వాక్యాన్నవద్దు.

ఏదో అవసరంకొద్దీ ఈ పనిచేశాను. కానీ విగ్రహం దగ్గరకు మీరే వస్తానన్నారు. చివరికి వాడే వచ్చేదేం?'' అన్నాడు బంగార్రాజు పక్కన సూట్ కేసులో మీసాలు నోచిన గిల్టు నగలు, వజ్రాలు వైగైరాలను చూసి నవ్వుతూ.

"నామీద వాడికెట్టే నమ్మకం లేకపోయింది. వాడేం చేశాడంటే ఒక బాకు పిడిమీద నా వేలిముద్రలు తీసు కున్నాడు. తనకేదైనా మోసం జరిగితే ఆ బాకుతోనే ఎవర్నయినా హత్యచేసి హత్యానేరం నామీద తోసేస్తా నన్నాడు. ఇంతకీ వాడికొక్కవలసిందేమిటంటే ఏ కారణం వల్లనైనా తను పట్టుబడితే తనకేమీ తెలియదనీ కిరాయికి నా దగ్గర పనిచేస్తున్నాననీ చెబుతాడట. అందుకు అంగీక రించాలట నేను. అంగీకరించకపోతే నన్ను హంతకుణ్ణి చేస్తాడు. మీకూ, మీబోటి ఇంకా పెద్దలకూ సంబంధించిన కొన్ని ఫోటోలు వాడు నాకు చూపించి అవీ వాటి నెగ టివులూ ఇచ్చి తను పట్టుబడినా ఫోటోలసాయంతో బెది రించి తన్ను విడిపించాలని చెప్పాడట. అవికూడా తెచ్చాను'' అంటూ రమణరావు అవి బంగార్రాజు కందించి "బంగార్రాజుగారూ మీలో ఇంత రసికత వుందని నాకు నిజంగా తెలియదండీ'' అన్నాడు.

బంగార్రాజు ఆత్రుతగా వాటిని అందుకుని చూశాడు. చటుక్కున జేబులోకి తోసేసి "వాడాగదిలో వున్నాడు వెళ్ళి పలకరించారా'' అన్నాడు.

రమణరావాగదిలోకి వెళ్ళాడు. మీసాలు, గుండు భయంకరుడు మంచాలమీద వెల్లకితలా పడుకునివున్నారు. వాళ్ళని మంచాలకు బలంగా తాళ్ళతో కట్టేశారు. రమణ రావు లోపలకు వెళ్ళి తలుపులు వేసి మీసాలును సమీ

పించి "వాళ్ళు చెప్పిన నేరాలన్నీ ఒప్పేసుకో. ఇంకెన్నడూ బ్లాక్ మెయిలింగ్ జోలికి వెళ్ళనని హామీ ఇచ్చేయ్. నిన్ను విడిపిస్తాను."

"అంతా మోసం నాకేమీ తెలియదు" అన్నాడు మీసాలు.

"బాగుంది గంగన్న సొమ్ముగురించి నాకేమీ తెలీదంటే నువ్వు నమ్మావా? నీ విషయంలోనూ అంతే. ఒప్పేసుకుంటే నీకే మంచిది నన్నింకా బ్లాక్ మెయిల్ చేయగలనని అనుకోకు. వేలిముద్రలున్న చాకు నేను వెనక్కి తెప్పించేసుకున్నాను" అన్నాడు రమణరావు.

"ఒప్పేసుకుంటాను కానీ నన్ను వీళ్ళు వదిలిపెడతారా?" అన్నాడు మీసాలు.

"వదులుతారు. కానీ నీ పిలక వాళ్ళ చేతుల్లోవుంచుకుంటారు. నీకు ట్రిక్ ఫోటోగ్రఫీలో సామర్థ్యముందనీ అదుపయోగించి దొంగ ఫోటోలు తీసి బ్లాక్ మెయిలింగ్ డబ్బు సంపాదిస్తున్నావనీ ఇక మీదట అలా జేయననీ కాగితం రాసివ్వాలి. అప్పుడు వదులుతారు" అన్నాడు రమణరావు.

"గంగన్న సొమ్ముకోసం ప్రయత్నించి బ్లాక్ మెయిలర్ గా తేలాను" అన్నాడు మీసాలు బాధగా.

"బాధపడకు ఆసొమ్ము తప్పక దొరుకుతుందిలే" అన్నాడు రమణరావు.

12

"రమణరావంటే మజాకా అనుకున్నావ్ కాబోలు పచ్చిరక్తం కళ్ళజూస్తాడు" అన్నాడు రమణరావు.

"మిమ్మల్ని చాలా తక్కువ అంచనా వేశాను..."

అన్నాడు మీసాలు తలవంచుకుని.

"ఏమీ ఫరవాలేదు. అదీ ఒకందుకు మంచిదే అయింది. ఈ రోజునించీ నువ్వు నా అనుచరుడివి. గంగన్న సామ్ముకోసం మనమిద్దరం ప్రయత్నించేద్దాం. ఇంతకీ దాని గురించి నీకు మొట్టమొదటి ఆచూకీ బాబా దగ్గర్నుంచి కదా వస్తే వాడిప్పుడెక్కడున్నాడు?"

"చాలా మొండివాడు వాడు. నిజం చెబుతున్నాడో తెలీదు, అబద్ధమాడుతున్నాడో తెలీదు. వాడి మాటలు నమ్మి రామయ్యదగ్గరకు వెళ్ళాను. రామయ్య మీదగ్గరకు పంపాడు."

"నేను బంగార్రాజు చేతుల్లోకి తోశాను. అయితే ఇందులో చిన్న తమాషా ఉంది. మిగతా వాళ్ళందరూ కూడా బెదిరింపుకు లొంగిపోయి తప్పించుకోవడంకోసం గంగన్న సామ్ముగురించి చెప్పారు. ఏ బెదిరింపూ అక్కర్లేకుండా ఈ సంగతి తెలుసునని ఒప్పుకున్నది బాబా ఒక్కడే! తెలిస్తే అతనొక్కడికే ఈ విషయం తెలిసుండాలి."

"వాడింకా ఈఊళ్ళోనేవున్నాడు. రోజూ సాయంత్రం ఏడు గంటలకు మా ఇంటికి వస్తాడు."

"మా అమ్మాయిని బంధించడానికీ బాబా తెలివితేటలే కదూ నీకుపయోగపడ్డాయని చెప్పావ్."

"అవును!"

"అయితే అట్నించి నరుక్కువద్దాం. బాబామీద మా అమ్మాయిని ప్రయోగించి విషయాన్ని లాగుదాం. ఇలాంటి విషయాల్లో ఆడవాళ్ళు పనిచేసినట్లు మరే మంత్రమూ పనిచేయదు" అంటూ రమణరావు ఆలోచనలో

పడ్డాడు. ఆయన బుర్రలో పెద్దఎత్తున పథకమేదో తయారవుతోంది.

మీసాలు వెళ్ళిపోయాక ఆయన తన కూతుర్ని పిలిచి "చూడమ్మా యమునా ఇదివరలో నువ్వు చంద్రభాననే కుర్రాడిని ప్రేమించిమోసపోయావు. ఈసారింకో కుర్రాడిని ప్రేమించి మోసగించాలి నీవల్లనవుతుందా?" అన్నాడు.

"ఎవరిని ఎందుకు?" అంది యమున.

"బాబాని. వాడు నన్ను మోసం చేశాడు. మాయ మాటలు చెప్పి నిన్ను దొంగ వెధవలకప్పగించాడు. అందు వల్ల నువ్వెన్ని చిక్కుల్లో పడ్డావో నేనెన్ని చిక్కుల్లో పడ్డానో నువ్వే చూశావ్ గదా" అన్నాడు రమణరావు.

"నీకులాగే అతనుకూడా ఆ దొంగ వెధవల చేతిలో పడ్డాడు నాన్నా. గత్యంతరం లేక వాళ్ళ చేతికి నన్నప్పగించాడు కానీ అతనికి నిజంగా నేనంటే ఇష్టం. అక్కడ గుండు భయంకరుడు నామీద చేయి చేసుకోకుండా చాలా కష్టపడ్డాడు. తనకు వాడినెదిరించే బలంలేదని తెలిసికూడా ఊరుకోలేదు" అంది యమున.

"కొంపదీసి మళ్ళీ ప్రేమలోగానీ పడలేదు కదా నువ్వు!" అన్నాడు రమణరావు చిరాగ్గా.

యమున జవాబివ్వలేదు. మళ్ళీ రమణరావే అన్నాడు. "ప్రేమలో పడ్డా పడకపోయినా వాడితో కాస్త పరిచయం ఏర్పడింది గదా–ప్రేమించానని నటించి వాణ్ని మోసం చేయగలవా?"

"ఎందుకు?"

"కొన్ని కోట్ల రూపాయలకు సంబంధించిన ఆచూకీ వాడికి తెలుసునని నాకు నమ్మకంగా వుంది. కొన్నాళ్ళ

పాటు నువ్వు వాడిని కలుసుకుని ప్రేమ నటించి సమాచారం సేకరించాలి...''

యమున ఆలోచనలో పడింది.

13

''ఎలాగుంది మా ఇల్లు!'' అంది యమున.

''చాలా రోజుల పరిచయం తర్వాత మీ ఇంటికి తీసుకొచ్చావ్. ఇంతకాలం నువ్వు చాలా డబ్బున్న దానివనని అనుకుంటున్నాను. మీ ఇల్లు చూస్తే అలాగనిపించడం లేదు......'' అన్నాడు బాబా.

''ఐశ్వర్యం అనుభవించడానికిగానీ ఆర్భాటానికి కాదు కదా. కొండమీది కోతి కావాలన్నా దిగివస్తుంది నాకు'' అంది యమున.

''నీ అభిప్రాయంతో నేను ఏకీభవించను. మనదగ్గర డబ్బున్నా లేకపోయినా నలుగురూ మనదగ్గర డబ్బుందని అనుకోవాలి. దర్జాగా మసలాలి. ఇది నా ఆశయం.''

''కోయ్.'' అంది యమున. ''అదే నిజమైతే నువ్వెలా గెందుకుండడంలేదు? గజదొంగ గంగన్న దోచిన సొమ్ము ఎక్కడుందో నీకు తెలుసును కదా...''

బాబా నవ్వి, ''ఆ డబ్బు ముట్టుకునే ఉద్దేశ్యం నాకు లేదు. ఎందుకంటే అది నాదికాదు సరిగదా_ఒక ప్రమాదకరమైన వ్యక్తిది. ఎప్పుడైనా నేనా డబ్బు కనుక ముట్టుకుంటే అది నా ప్రాణంకంటె విలువైన వ్యక్తులకోసం మాత్రమే అవుతుంది. నా ప్రాణంకంటె విలువైన వ్యక్తులంటే నన్ను ప్రేమించేవారన్నమాట. ఈ ప్రపంచంలో ఇంతవరకూ నాకు ప్రేమాభిమానాలు దొరకలేదు'' అన్నాడు.

"నామీద నీ అభిప్రాయమేమిటి?" అంది యమున చటుక్కున.

"మంచి అభిప్రాయమే వుంది కానీ నువ్వు నన్ను ప్రేమిస్తున్నావనుకోను" అన్నాడు బాబా.

"ఎందువల్ల?"

"చాలా సింపుల్. అట్టే చదువు లేదు నాకు. వుద్యోగం లేదు. ఏ పరిస్థితులలోనూ గంగన్న సొమ్ము జోలికి వెళ్ళను. ఇప్పుడు చెప్పు. నువ్వు నన్ను పెళ్ళి చేసుకుంటావా?"

యమున విషాదంగా నవ్వి, "నా గత చరిత్ర తెలును నీకు. చరిత్ర లేని విధవకికూడా పెళ్ళి చేసరికి ఆడదాని చరిత్ర కావాలి. అలాంటి సందర్భంలో నువ్వు నన్ను పెళ్ళాడుతానంటే నాకే ఇబ్బందీ లేదు. హాయిగా అంగీకరిస్తాను. కానీ......" అని ఆగింది.

బాబా ఆశ్చర్యంగా యమున వంక చూసి, "కానీ......" అన్నాడు.

"మా నాన్న బొత్తిగా డబ్బులేనివాడు కాదు. కానీ ఆయన ఒకాయనకి కొంత డబ్బు బాకీ పడ్డాడు. ఎవరికో జామీనుంటే అసలువాడు వ్యాపారంలో దివాళాతీయగా ఆ బాకీ మా నాన్నకు తగులుకుంది. ఆ బాకీ తీర్చడం మా నాన్నవల్ల కాదు. ఇది జామీను బాకీ గదా అన్న జాలిలో ఆయన మా నాన్నతో ఉపాయం చెప్పాడు. 'మీరు నాకేమవుతారని బాకీ కొట్టేస్తాను. మీ బాకీ కొట్టేయాలంటే ఏదైనా బంధుత్వముండాలి' అన్నాట్టాయన. లేని బంధుత్వం హాఠాత్తుగా ఎలా పుట్టుకొస్తుందంటే, మీ అమ్మాయిని నాకిచ్చి పెళ్ళి చేస్తే. మీరు నాకు మామగా రాతారు, అన్నాట్ట ఆయన. మా నాన్న ఆవేశపడకుండా

ఇంటికి వచ్చి విషయాన్ని చెప్పాడు. చెప్పడంలో ఆయన ఉద్దేశ్యం—బాకీ తీర్చడంకోసం నన్నీ పెళ్ళికి ఒప్పుకోమని కాదు. నా పెళ్ళికీ ఒక అప్పుకీలంకె వున్నదన్న విషయం నాకు చెప్పడమే......''

''పోనీ ఆయన్ను పెళ్ళి చేసుకోలేకపోయావా?''

''ఆయన ఏభయ్యో పడిలో పడ్డాడు. కనీసం రూపమైనా బాగుండదు. కానీ ఆశకు మాత్రం హద్దులేదు. అందుకే ముప్పై వేలుపెట్టి నన్ను కొనాలని చూశాడు.''

''అయితే మీ నాన్న బాకీ ముప్ఫైవేలన్నమాట!'' అన్నాడు బాబా.

''అవును. నా పెళ్ళి నేను ప్రేమించిన వారితో జరిగితే నాన్న ముప్పైవేలు నష్టమైపోతాడు...'' అంది యమున.

''బాగుంది. ఆడపిల్లకు కట్నమిస్తేకానీ పెళ్ళికాని ఈ రోజుల్లో, ఎదురిచ్చి చేసుకునే వరుడెక్కడుంటాడు?''— అన్నాడు బాబా.

''నాన్నకు నా అందంమీద నమ్మకం. నాకు నా భవిష్యత్తుమీద నమ్మకం'' యమున మాట్లాడుతూ వెళ్ళి అక్కడున్న డ్రెస్సింగ్ టేబుల్ సొరుగు తీసింది. ఆమె వెనకాలే నడిచిన బాబా సొరుగులోవున్న రివాల్వర్ చూసి ఉలిక్కిపడ్డాడు. అయితే యమున సొరుగులోంచి రివాల్వర్ తీయలేదు. చిన్న కుంకుమభరణితీసి బొట్టు పెట్టుకుంది.

''ఇది మామూలు బొట్టుకాదు. ప్రత్యక్షదైవం ప్రసాదించిన బొట్టు. నువ్వుకూడా పెట్టుకో'' అంది యమున. ఏదో ఊరిలో దేవుడు మనిషిరూపంలో వెలసి మహిమలు చేస్తున్నాడట. యమున ఆ గ్రామం వెళ్ళి ఆ మనిషిని

స్వయంగా చూసివచ్చింది. ఆయన ఈ కుంకుమభరిణ ఇచ్చి నిత్యమూ బొట్టు పెట్టుకోమనీ మేలు జరుగుతుందనీ అన్నాడుట.

"మరి ఆ రివాల్వర్ కూడా ఆయనే ఇచ్చాడా?" అన్నాడు బాబా.

"అది నీకళ్ళ పడిందీ..." అంది యమున నవ్వుతూ. "ఇది మా నాన్న నాకిచ్చాడు. ఇందులో ప్రాణాలు తీసే గుళ్ళులేవు. ఇది ఏ మనిషికి గురిపెట్టి మీట నొక్కితే ఏమాత్రం చప్పుడు కాదు. ఆ మనిషి మాత్రం సుమారు పదిహేను నిముషాలపాటు నిశ్చలంగా వుండిపోతాడు. దీని ప్రభావం అయిపోయాక ఆ మనిషి తన పనులు మామూలుగా కొనసాగిస్తాడు తప్పితే పదిహేను నిమిషాల సేపు తను నిశ్చలంగా ఉన్న విషయాన్నికూడా గుర్తించడు..."

"దీని ప్రభావం అనుభవపూర్వకంగా తెలుసుకుంటే గానీ నమ్మలేను. నేను నీమీద ప్రయోగించి చూడనా?" అన్నాడు బాబా.

క్షణం తటపటాయించి "అలాగే చెయ్యవచ్చు కానీ, అందుకు నాకు ప్రతిఫలంగా ఏమిస్తావ్?" అంది యమున.

"పేదవాడిని —ఏమివ్వగలను?" అన్నాడు బాబా.

"జీవితమంతా నీకు దాసినైవుంటాను. గంగన్న సొమ్ములోంచి కొంతయినా బయటకు తీసి నా జీవితం ఆ ముసలాడిపరం కాకుండా కాపాడు" కన్నీళ్ళతో అంది యమున.

ఆమె కన్నీళ్ళు బాబాని కదిలించాయి. క్షణంపాటు

అతనికేం మాట్లాడాలో తోచలేదు. తర్వాత నెమ్మదిగా "ఓకే" అని రివాల్వర్ తీసి ఆమెను షూట్ చేశాడు. వెంటనే యమున శిలాప్రతిమలా నిలబడిపోయింది. నిజా నిజాలు పరీక్షించడానికి బాబా ఆమెను మంచంమీద పడుకోబెట్టాడు. ఆమె నటించడం లేదనీ నిజంగానే స్పృహతప్పిపోయిందనీ అతనికి అర్థమైంది. ఇంతలో వీధి తలుపుల దగ్గర ఏదో అలికిడి కాగా బాబా బట్టలస్టాండు వెనక నక్కాడు.

ఒకటి రెండు నిముషాల్లో రమణరావు ఆ గదిలోకి వచ్చి నిద్రపోతున్న కూతుర్ని చూసి "మరీ చిన్నతనం తగ్గలేదు వీధి తలుపులు జార్లావేసి నిద్దరోయింది" అనుకుని అక్కణ్ణించి బయటపడ్డాడు. బాబా జాగ్రత్తగా ఆయన్ని ననుసరించాడు.

రమణరావు వీధితలుపులు వేసి తన ప్రత్యేక గదిలోకి వెళ్ళాడు.

గోడకు తగిలించిన ఒక్కొక్క బొమ్మనే తీసి తన జేబులోని రెంచీతో ఒక్కొక్క మేకునే తీసి బీరువాలు తెరుస్తూంటే బాబా అది చాటుగా చూశాడు.

14

"నేను బాబాని పెళ్ళిచేసుకుంటాను" అంది యమున.

తన కెదురుగా ఉన్న ముప్ఫైవేల వంకా ఆశ్చర్యంగా చూస్తూ రమణరావు "అంటే ఇతగాడికి గంగన్నసొమ్ము సంగతి నిజంగా తెలుసునన్న మాటే!" అన్నాడు.

"కానీ ప్రాణంపోయినా ఆ విషయాన్నతనొప్పుకోడు. నేను చెప్పిన కట్టుకథ నమ్మి నా కన్నీళ్ళకు కరిగిపోయి ఈ మాత్రాన్నతను బయటకు తీశాడు. ఇలాంటి వాడిని

పెళ్ళి చేసుకుంటేనే నేను సుఖపడతాను..." అంది యమున.

యమునకూ, బాబాకూ వివాహం సింపుల్‌గా జరిగి పోయింది.

పెళ్ళికి శ్రీనివాస్ వాల్తేర్‌నించి వచ్చాడు.

పెళ్ళైన వారంరోజులకు బాబా భార్యతో "మా నాన్న బ్రతుకు నీకు తెలుసా?" అనడిగాడు.

తెలియదంది యమున.

"బ్లాక్ మెయిలింగ్ చేసి బ్రతుకుతున్నాడాయన" అన్నాడు బాబా.

"ఒస్ అంతే కదా అదేం తప్పుకాదు. అందరి తప్పులూ బయటపెట్టేరంటే ఈ దేశాన్నేలడానికి మచ్చలేని మనిషి ఒక్కడుకూడా మిగలడు. మా నాన్న బ్లాక్ మెయిల్ చేస్తాడన్న సంగతి నాకూ తెలుసు..." అని నవ్వింది యమున.

"బ్లాక్ మెయిలింగ్ తప్పు కాదంటావ్" అన్నాడు బాబా.

కాదన్నట్లు తలాడించింది యమున.

"అయితే నేను బ్లాక్ మెయిలింగ్ చేసి డబ్బు సంపాదిస్తే నీకు అభ్యంతరమా?" అన్నాడు బాబా.

"లేదు కానీ మాకా కర్మంపట్టింది. అంతగా కావాలను కుంటే గంగన్న సొమ్ముండనే వుంది" అంది యమున.

"బాగుంది. అది వాడి సంపాదన. ఇది నా సంపాదన" అని నవ్వాడు బాబా.

15

విశాఖపట్నంనించి రాజమండ్రి వచ్చిన ఒక కూలివాడు తన కళ్ళతో స్వయంగా ఆల్‌కట్ గార్డెన్స్‌లో ఒక

ప్రాంతంలో భూమిలోంచి రామవిగ్రహం చొచ్చుకుంటూ పైకి రావడం చూశాడట. ఆ విగ్రహాన్ని చూడ్డానికి జనం తీర్థప్రజలా వెళ్ళివస్తున్నారు.

విగ్రహం చుట్టూ గుడిసె వెలిసింది. దాన్ని ప్రప్రథమంగా చూసిన కూలివాడు ఆ గుడిసెకు సంరక్షకుడయ్యాడు. అతని బంధువర్గం అక్కడ భక్తకోటిగా మారారు. అప్పుడప్పుడు భక్తులిచ్చే కానుకలను గ్రహించడానికి హుండీ వెలసింది.

కాలక్రమేనా ఆ విషయం ప్రజలలో పాతబడింది.

"నేను రామభక్తుడిని. అన్యాయాన్ని నేను సహించలేను. ఇటీవల లాడ్జిలో నువ్వు చేసిన కేళీ విలాసాలు ఫోటో రూపంలో చూశాక ఏకపత్నీవ్రతుడైన రాముడి భక్తుడిగా నేను సహించలేకపోయాను. ఇది కలియుగం కాబట్టి నీవద్దనుంచి కొంత డబ్బుతీసుకుని నీ నేరాన్ని క్షమించదల్చాను. అల్కాట్ తోటలో కొత్తగా వెలిసిన రామాలయం హుండీలో పదివేలు వేసి నీ పాపపరిహారం కావించుకో. రామాలయం గురించి ఎటువంటి ఆరాలు తీయడానికి ప్రయత్నించినా ఈ ఫోటోలు రాజమండ్రి సమాచారమ్‌లో ప్రచురించబడతాయి."

క్రింద రామభక్తుడి పేర సంతకం ముకటుంది. ఈ ఉత్తరం చదివి బంగార్రాజు కలవలపడ్డాడు. రాక్షసుడి విగ్రహం కూలిపోయిక ఆయనకు బ్లాక్ మెయిలింగ్ బాధ లేదు. మళ్ళీ మొదలు కావడంతో ఏం చేయాలో తోచక ఆయన రమణరావుకు కబురుపెట్టాడు.

రమణరావా ఉత్తరం చదివి చాలా కంగారుపడ్డాడు' లాడ్జిలో ఫోటోలు తీయడానికి ఏర్పాటు చేసినది తనే

కానీ ఈ ఉత్తరం తను వ్రాయలేదు. డబ్బు వసూలు చేయడానికి సులువైన మార్గాలకోసం తను వెతుకుతున్నాడు. కానీ ఎవరో తెలివిగా ఈ రామాలయం ఏర్పాటు చేసుకున్నాడు. ఆ వ్యక్తిని తెలుసుకోవాలి.

రమణరావు తక్షణం వెళ్ళి చంద్రముఖిని కలుసుకున్నాడు ఈ చంద్రముఖినే బంగార్రాజు లాడ్జిలో కలుసుకుని ఫోటోల్లో కెక్కాడు. ఆమె తనకేమీ తెలియదనీ తమ్ముడు రీలు వాష్ చేసి ఇవ్వగానే యధాతథంగా రమణరావు కందజేశాననీ చెప్పింది.

"ఎవడో పోటీదారు బయల్దేరాడు. వాణ్ణి త్వరగా అంతం చేయాలి..." అనుకుంటూ ఇల్లుచేరిన రమణరావు ఇంటివద్ద ఒక ఉత్తరం ఎదురైంది. ఉత్తరం చదివిన రమణరావుకు బాగా చెమటలు పట్టాయి.

అది రామభక్తుడి ఉత్తరం. రమణరావు పక్కా బ్లాక్ మెయిలర్ అన్న రహస్యం దాచడానికి పదివేలవుతుందట. రామాలయం గురించి అతనేవిధమైన ఆరాలు తీయడానికి ప్రయత్నించినా అతని మూడు బీరువాల రహస్యం బయట పడుతుందట.

రమణరావుకు కాళ్ళూ, చేతులూ ఆడలేదు. ఎవడో తనను మించినవాడీ ఊళ్ళో చేరాడు. రమణరావు మారు మాట్లాడకుండా రాముడిహుండీలో సొమ్ము వేసివచ్చాడు.

దిగాలుగావున్న తండ్రిని చూసి యమున దైవభక్తి అలవర్చుకోమని సలహాయిచ్చింది. ఇటీవల యమునకు భక్తి చాలా ఎక్కువై ప్రతిరోజూ రామాలయానికి వెళ్ళి వస్తోంది.

"నీ మొగుణ్ణి కదిపి గంగన్న సొమ్ము త్వరగా తేల్చు".

అన్నాడు రమణరావు.

అయితే ఆ ఆశకూడా ఆయనకెన్నాళ్ళో నిలవలేదు. మీసాలువచ్చి ఒకరోజు పిడుగులాంటి రహస్యం బయట పెట్టాడు.

గంగన్న దోచినసొమ్ముతో సహా పోలీసులకు దొరికి పోయేడట. అయితే ఆ నగలు, వజ్రాలు అన్నీ ఆయా వర్తకుల బ్లాక్ మనీకి సంబంధించినవి అట. అందువల్లన పోలీసులకు బాగా లంచంవేసి తమ వస్తువులు తిరిగి తీసేసుకుని బయటకుమాత్రం పోయాయనే చెప్పించారట. ఈ విషయాన్ని నిజంగా నిరూపించడానికి సహాకరించినందుకు గంగన్న కుటుంబం ఆచూకీ తెలుసుకుని వెళ్ళి వాళ్ళ దగ్గర్నుంచి రాబట్టేడట.

"అయితే ఈ బాబా గాడి మాటేమిటి?" అన్నాడు రమణరావు.

"వాడు చేసిన మోసానికి వాణ్ణి చంపేయాలి" అన్నాడు మీసాలు.

"వాడిప్పుడు నా ఇంటల్లుడు. తొందరపడ్డానికిలేదు" అన్నాడు రమణరావు సాలోచనగా. "అంతకంటె ముందుగా అంతం కావలసిన వాడింకొకడున్నాడు. ఇప్పుడీ ఊళ్ళోకి ఓ కొత్త బ్లాక్ మెయిలర్ వచ్చాడు. వాడెవరో నువ్వు తెలుసుకోవాలి."

16

"మీకు గంగన్న సొమ్ముగురించి ఏమీ తెలియదుటగా. అసలు గంగన్నసొమ్మేదీ దాచలేదటగా..." అంది యమున.

బాబా నవ్వి "అవన్నీ నీ కనవసరం. కానీ నేను

నీకిచ్చిన ముప్పైవేలు మాత్రం మీ నాన్న బీరువలోంచి తెచ్చిచ్చాను. అందుగురించి ఆ రోజు మీ ఇద్దరికీ రెండేసి సార్లు స్పృహ పోగొట్టాల్సివచ్చింది'' అన్నాడు.

యమున ఏదో అనబోయింది. ఎవరో తలుపుతట్టారు.

''నాన్నైవుంటాడు'' అంది యమున.

''రాత్రి కొత్తదంపతులు ఏకాంతంలో ఉన్నప్పుడు తలుపు తట్టినవాడు మీ నాన్నగాక ఎవరౌతారు?'' అన్నాడు బాబా.

యమున బట్టలు సవరించుకుని లేచివెళ్ళి తలుపులు తీసింది.

రమణరావు లోపలకువచ్చి ''నీతో మాట్లాడాలి!'' అన్నాడు బాబాని చూసి.

''మాట్లాడండి'' అన్నాడు బాబా.

''నువ్వు నన్ను మోసం చేశావ్.''

''లేదు. మీరే కావాలని మోసపోయారు.''

''నా కూతుర్ని మరీ ఇంత బికారికిచ్చి వివాహం చేస్తాననుకోలేదు.''

''అదే మీ విచారమైతే మీరేం బాధపడకండి. మీ అల్లుడు బికారి కాడు అడిగిన వెంటనే మీకూతురికి ముప్పైవేలిచ్చే పెళ్ళిచేసుకున్నాడు.''

''నీ మాటలు గదిబైటకు స్పష్టంగా వినబడుతున్నాయి అది నాడబ్బేకదా...''

బాబా నవ్వి ''మీ డబ్బైనా మీకే యిచ్చానుగదా మామగారి దగ్గర డబ్బు తీసుకునేటంత హీనుణ్ణి కాను నేను'' అని ''యమునా బీరులోంచి ఆ పదివేలూ తీసి మీ నాన్నగారికిచ్చేయ్'' అన్నాడు.

"ఏ పదివేలు?" అంది యమున.

"రామాలయం నుంచి నువ్వు తెచ్చిన దాంట్లో వేరే పెట్టమని చెప్పాను అవి!" అన్నాడు బాబా.

రమణరావు అవాక్కయిపోయాడు. కూతురు పదివేలూ అందించేక కూడా మామూలు మనిషి కావడానికి ఆయనకు పది నిముషాలు పట్టింది.

"నువ్వా రామభక్తుడివి!" అన్నాడాయన ఆశ్చర్యంగా నమ్మలేనట్లు.

"అవును. మీదగ్గరే నేర్చుకున్నాను" అంటూ బాబా వివరించాడు.

విశాఖపట్నం బస్‌స్టాండ్‌లో తనకు పరిచయమైన కొందరు శ్రమజీవుల సహాయంతో అల్కాట్ తోటలో రామాలయం వెలయింపజేశాడు. రామాలయానికి కాస్త పేరు వచ్చేక ప్రత్యేకంగా తయారుచేయించిన హుండీ నక్కడ పెట్టించాడు. హుండీకి నలుగురుకి తెలిసే విధంగా పైమూతవద్దనే కాక ఎవరూ కనిపెట్టలేని ఒకపక్క తలుపు వుంది. అది తీసే విధానం బాబాకూ యమునకు తెలుసును. దేవుడి పేరిట వచ్చిన డబ్బుమాత్రం అందులో వదిలి బ్లాక్ మెయిలింగ్ డబ్బు యమునచేత తెప్పిస్తుంటాడు బాబా.

నిన్నుగురించి నేను విచారపడనవసరంలేదు. అన్ని విధాలా నాకు తగ్గ అల్లుడివి. మనం ఒకరితో ఒకరం చేతులు కలుపుకుందాం. ఇద్దరి తెలివితేటలు జోడైతే..."

"అయినపక్షంలో బ్లాక్ మెయిలింగ్ ఎప్పటికైనా ప్రమాదం. అది వదిలిపెట్టి వ్యాపారం ఆరంభించాలి" అన్నాడు బాబా.

మర్నాడు రమణరావింటికి నగరంలోని పలువురు వ్యాపారప్రముఖులు వచ్చేరు బాబాని తమ వ్యాపారంలో భాగస్థుడిగా చేర్చుకునే విషయాన్ని చర్చించడానికి. ఆ సందర్భంలో చర్చలు తప్పుదారితొక్కి సంభాషణ రహస్యాలు దాచడంమీదకు మళ్ళింది. ఒకో వణిక్ప్రముఖుడూ తనకు తెలిసిన గొప్ప రహస్యం గురించి చెబుతూంటే అందరూ అయ్యేవరకు ఆగి "కాకినాడలో బ్యాంకు దోపిడి జరిగింది చూశారా ఆ దోపిడీదారుల ఆచూకీ నాకు పూర్తిగా తెలుసు" అన్నాడు బాబా.

అంతా మ్రాన్పడిపోయారు.

చర్చలు విజయవంతంగా ముగిసి రెండు లక్షల రూపాయల పెట్టుబడితో బాబాని భాగస్థుడిగా చేర్చుకునేందుకు ముగ్గురు వణిక్ప్రముఖులంగీకరించి వెళ్ళిపోయేక రాత్రి యమున గదిలో భర్తను "కాకినాడ బ్యాంకు దోపిడి గురించి నిజంగా మీకు తెలుసా?" అంది.

"సంభాషణలు జరుగుతూన్నప్పుడు అందరి దృష్టి నామీద కేంద్రీకరించబడడంకోసం ఎంత పెద్ద అబద్ధమైనా ఆడతాను. అది నా అలవాటు, బలహీనతకూడా" అన్నాడు బాబా.

—: ఐపోయింది :—